జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 9 | సెప్టెంబర్ | 2025 ◆ పేజీలు : 7

# దేశ అభివృద్ధికి శాస్త్రవేత్తలు అవసరం

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 8, ప్రజాజ్యోతి:** దేశ అభివృద్ధి కి, ప్రజల భవిష్యత్ పురోగతికి శాస్త్రవేత్తలు ఎంతో అవసరం అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం కలెక్టర్ కరకగూడెం జవహర్ నవోదయ విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల సమగ్ర పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, కిచెన్ షెడ్, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్ ,మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలను ఆయన పరిశీలిస్తూ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు, కలెక్టర్ తరగతి గదిలో విద్యార్థులతో మిగతా 2 లో...





## పర్యావరణ అధికారుల...

# నిర్లక్ష్యమే శాపమా...!?

2 లో..

● మణుగూరు, ప్రజాజ్యోతి

"పినపాక నియోజకవర్గ కేంద్రమైన మణుగూరు, పినపాక మండలాల సరిహద్దుల్లో నిర్మించిన భద్రాద్రి పవర్ ప్లాంట్ పర్యావరణ అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు శాపంగామారిందని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో బీటీపీఎస్ బాధిత ప్రజలకు ప్రాణ సంకటంగా మారిందని పరిసర ప్రాంత ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. అత్యాధునిక పరికరాలతో నిర్మాణం చేయాల్సిన ప్లాంట్ ను పాతరకపు పరికరాలు అనగా సబ్ క్రిటికల్ తో నిర్మాణం చేయడం వలన ఈ ప్రాంత గ్రామాలు మొత్తం కాలుష్యంతో మునిగి తేలుతున్నాయి."

- బీటీపీఎస్ బాధిత ప్రజలకు ప్రాణ సంకటంగా మారిందా....
- బీటీపీఎస్ సబ్ క్రిటికల్ నిర్మాణమే ఇందుకు కారణమా...!
- పర్యావరణ అధికారుల జాడెక్కడ...?

## నలుగురు మావోయిస్టులు అరెస్ట్

- అరెస్ట్ ఐన మావోయిస్టులపై ఐదు లక్షల రివార్డ్
- ఆయుధాలు,పేలుడు పదార్థాలు కరపత్రాలు స్వాధీనం



**చర్ల, సెప్టెంబర్ 8(ప్రజాజ్యోతి ):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ బీజాపూర్ జిల్లాలో నిర్వహిస్తున్న మావోయిస్టు వ్యతిరేక ప్రచారంలో భాగంగా డి ఆర్ జి బీజాపూర్ బాసగుడ పోలీస్ స్టేషన్ , కోబ్రా 210 సి ఆర్ పీ ఎఫ్ 229 సంయుక్త బృందం మిగతా 2 లో...

## మావోయిస్టుల కుట్ర భగ్నం

- పది కిలోల ఐఈడి బాంబు నిర్వీర్యం

**చర్ల, సెప్టెంబర్ 08:(ప్రజా జ్యోతి):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ బీజాపూర్ జిల్లాలోని థానా గంగలూరు ప్రాంతంలోని డి ఆర్ జి బీజాపూర్, సి ఆర్ పీ ఎఫ్ 222 బృందం చెర్పాల్, మిగతా 2 లో...







# రహదారులా.. ప్రమాద ఘంటికలా...!

- ఆదమరిస్తే... ఆసుపత్రికే..
- ప్రధాన రహదారి పై భారీ గుంతలు
- వాహనదారుల ఇక్కట్లు
- మండల వ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్లు
- నిధులు లేవంటున్న అధికారులు

2 లో...

# దేశ అభివృద్ధికి శాస్త్రవేత్తలు అవసరం



(మొదటి పేజీ తరువాయి... )

ఆత్మీయంగా మాట్లాడుతూ వారి జీవిత లక్ష్యాలను తెలుసుకున్నారు. విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అవ్వాలని తమ అభిలాషను తెలియజేయగా, కలెక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగత లక్ష్యసాధనతో పాటు దేశాభివృద్ధికి తోడ్పడే దిశగా చదువుకోవడం, పరిశోధనలు చేయడం అత్యంత ముఖ్యమని సూచించారు. సమాజంలో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపే ఆవిష్కరణలు, పరిశోధనలు చేయగలిగే శాస్త్రవేత్తలు దేశానికి ఎంతో అవసరమని, విద్యార్థులు ఆ దిశగా కృషిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ డైనింగ్ హాల్ పరిశీలించారు దోమలు, ఈగలు లోపలికి ప్రవేశించకుండా మెష్ ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. అదేవిధంగా కూరగాయలు, పెరుగు తదితర పదార్థాలు నిల్వ చేసుకోవడానికి ఫ్రిజ్ ఏర్పాటు చేయాలన్న సిబ్బంది అభ్యర్థనపై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారుల కు సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ నవోదయ విద్యాలయాలు దేశ వ్యాప్తంగా ఒక ప్రత్యేకమైన బ్రాండ్ గా గుర్తింపు పొందాయని, ఆ ప్రతిష్టను నిలబెట్టే విధంగా అధికారులు ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచి, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అందించాల్సిందిగా ఆయన సూచించారు. అదేవిధంగా విద్యార్థుల మానసిక, శారీరక అభివృద్ధికి అవసరమైన క్రీడా సామాగ్రి, లైబ్రరీ పుస్తకాలు త్వరలోనే ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ పాఠశాల సిబ్బందితో సమావేశమై విద్యార్థులకు అందజేస్తున్న సదుపాయాలు, ఉన్న సమస్యలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యున్నతికి, పాఠశాల అభివృద్ధి కోసం చేపట్టవలసిన పనులను తమ దృష్టికి తీసుకువస్తే వాటిని ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట పాఠశాల ప్రిన్సిపల్ భాస్కరాచారి, ఉపాధ్యాయులు నయనాదేవి, చంచల్, అనిత, స్టాఫ్ నర్స్ రాధిక, సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నలుగురు మావోయిస్టులు అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి... )

పెద్ద విజయాన్ని సాధించింది. ఆదివారం పుట్కెల్–పోలంపల్లి ప్రాంతంలో జరిగిన సోదాల సందర్భంగా ముగ్గురు మహిళా మావోయిస్టులతో సహా నలుగురు మావోయిస్టులను అరెస్ట్ చేసారు వారి వద్దనుండి పేలుడు పదార్థాలు, విద్యుత్ వైర్, సేఫ్టీ ఫ్యూజ్, బ్యాటరీ, భూమి తవ్వే పరికరాలు ప్రచార సామగ్రి , నిషేధిత సంస్థ యొక్క కరపత్రాలను స్వాధీనం చేసుకున్నారు . అరెస్టు చేసిన మావోయిస్టుల వివరాలు హేమల భారతి అలియాస్ జోగి ప్లాటూన్ నం. 10 పార్టీ సభ్యుడు , రెండు లక్షల రివార్డు,జోగి మిదియం పీ ఎల్ జీ ఏ సభ్యుడు ఒక లక్ష రివార్డ్ ,దేవ హేమ్లా పీ ఎల్ జీ ఏ సభ్యుడు ఒక లక్ష రివార్డ్ , దోడి హిరే అలియాస్ శాంతి జాగర్గుండ–బాసగూడ ఎల్ ఓ ఎస్ సభ్యుడు ఒక లక్ష రివార్డ్ అరెస్ట్ చేయబడిన మావోయిస్టు నిందితులపై బాసగూడ పోలీస్ స్టేషన్ లో పేలుడు పదార్థాల చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి వారిని జ్యుడీషియల్ రిమాండ్ పై గౌరవ కోర్టులో హాజరుపరిచారు.

# మావోయిస్టుల కుట్ర భగ్నం



(మొదటి పేజీ తరువాయి... )

పెద్దకోర్మ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కు వెళ్లింది. ఈ ఆపరేషన్ సమయంలో విద్యుత్ తీగ కనిపించినప్పుడు చుట్టుపక్కల ప్రాంతాన్ని తీవ్రంగా శోధించారు. సోమవారం ఈ శోధన సమయంలో స్టీల్ టిఫిన్ లో దాదాపు పది కిలోల బరువున్న ఐ ఈ డి మూడు కిలోల బి జి ఎల్ సెల్ ముక్క వరుసగా అమర్చబడి ఉండటంతో బయటపడింది. స్వాధీనం చేసుకున్న ఐ ఈ డి ని బీజాపూర్ బి డి ఎస్ సి ఆర్ పీ ఎఫ్ 222 బెటాలియన్ బి డి బృందం జాగ్రత్తగా సురక్షితంగా అక్కడికక్కడే నిర్వీర్యం చేశాయి.

# పర్యావరణ అధికారుల నిర్లక్ష్యమే శాపమా....

- - బీటీపీఎస్ బాధిత ప్రజలకు ప్రాణ సంకటంగా మారిందా....
- - బీటీపీఎస్ సబ్ క్రిటికల్ నిర్మాణమే ఇందుకు కారణమా...!
- - పర్యావరణ అధికారుల జాడెక్కడ...?

**మణుగూరు, సెప్టెంబరు 08, (ప్రజాజ్యోతి ):** పినపాక నియోజకవర్గ కేంద్రమైన మణుగూరు, పినపాక మండలాల సరిహద్దుల్లో నిర్మించిన భద్రాద్రి పవర్ ప్లాంట్ పర్యావరణ అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు శాపంగామారిందని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో బీటీపీఎస్ బాధిత ప్రజలకు ప్రాణ సంకటంగా మారిందని పరిసర ప్రాంత ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. అత్యాధునిక పరికరాలతో నిర్మాణం చేయాల్సిన ప్లాంట్ ను పాతరకపు పరికరాలు అనగా సబ్ క్రిటికల్ తో నిర్మాణం చేయడం వలన ఈ ప్రాంత గ్రామాలు మొత్తం కాలుష్యంతో మునిగి తేలుతున్నాయి. మొదటిలోనే ఈ బిటిపిఎస్ ప్లాంట్ ను సూపర్ క్రిటికల్ తో నిర్మాణం చేయాలని నాడు అనేక మంది మేధావులు చెప్పినప్పటికీ దానిని నాటి ప్రభుత్వ పాలకులు, ప్రభుత్వ యంత్రాంగం పెడచెవిన పెట్టడం ద్వారా నేడు బిటిపిఎస్ నిర్వాసిత ప్రాంత గ్రామాల ప్రజలు కాలుష్యం కోరల్లో చిక్కుకొని పడరాని పాట్లు పడుతున్న దుస్థితి కనిపిస్తుంది. బిటిపిఎస్ నిర్మాణ దశలో సూపర్ క్రిటికల్ పరికరాలతో నిర్మాణం చేస్తేనే, పర్యావరణ అనుమతులు ఇవ్వడం జరుగుతుందని అధికారులు తేల్చి చెప్పిన విషయం విదితమే. సూపర్ క్రిటికల్ పరికరాలతో నిర్మాణం చేయకపోవడం వలన బిటిపిఎస్ నిర్మాణం తొలిదశలోనే ఆపడం జరిగింది. సూపర్ క్రిటికల్ తోనే పవర్ ప్లాంట్ నిర్మాణం చేయాలని మానవ హక్కుల సంఘం కోర్టుకు వెళ్లిన విషయం తెలిసిందే. సబ్ క్రిటికల్ తో నిర్మాణం చేసే పవర్ ప్లాంట్ ను ఆపాలని కోర్టు తీర్పు ఇవ్వడం జరిగింది. అయినా కూడా నాడు కోర్ట్ తీర్పును ధిక్కరించి భద్రాద్రి పవర్ ప్లాంట్ ను నిర్మించడం వలన బాధిత గ్రామాల ప్రజలు విష జబ్బులతో తల్లడిల్లి పోతున్నారు. ఈ నేపథ్యంలో పర్యావరణ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే బాధిత ప్రజలకు ప్రాణ సంకటంగా మారిందని మేధావులు ఆరోపిస్తున్నారు.

### బీటీపీఎస్ సబ్ క్రిటికల్ నిర్మాణమే శాపంగా మారిందా...!

భద్రాద్రి పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసేటప్పుడు సూపర్ క్రిటికల్ వాడతామని చెప్పిన అధికారులు సబ్ క్రిటికల్ వాడటంతో కాలుష్యం ద్వారా వచ్చే ప్రాణాంతక జబ్బులతో బాధపడుతున్నారు. బిటిపిఎస్ నుండి రాత్రి సమయంలో కాలుష్యం వల్ల ఇంటి ఆవరణలో నల్లని బూడిద పడుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. కాలుష్య నియంత్రణ అధికారులు వచ్చినప్పుడు మాత్రమే బీటీపిఎస్ అధికారులు కాలుష్యాన్ని నివారించేందుకు అప్పటికప్పుడే చర్యలు చేపడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాలుష్యాన్ని నియంత్రించడంలో బీటీపిఎస్ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని పలువురు మండిపడుతున్నారు. తూ...తూ... మంత్రంగా చర్యలు చేపట్టడంతో ప్రజలు అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోజు రోజుకు కాలుష్య మహమ్మారికి ప్రజల ఆరోగ్యం క్షీణిస్తుందని బాధిత ప్రజలు వాపోతున్నారు. మా ప్రాణాలకు దిక్కు ఎవరంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేము ప్రాణాలతో ఉండాలా... కాలుష్యంతో మా ప్రాణాలను పోగొట్టుకోవాలా..? అని భయభ్రాంతులకు గురవుతున్నారు. బీటీపీఎస్ నుండి వెలువడే కాలుష్యం వల్ల తీవ్రమైన అనారోగ్యానికి గురౌతున్నా మా గోడు వినపడదా... అంటూ తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### బిటిపిఎస్ నిర్మించక ముందు ఎంతో ఆరోగ్యంగా ఉండేవాళ్లం....

బిటిపిఎస్ నిర్మించక ముందు ఎంతో ఆరోగ్యంగా ఉండేవారిమని, బీటీపిఎస్ కాలుష్యం వల్ల మా ఆరోగ్యాలను కాపాడుకోలేక ఆస్పత్రుల చుట్టూ తిరగలేక లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రజలు వాపోతున్నారు. అసలు బిటిపిఎస్ వల్ల మాకు నష్టమే తప్ప ఒరిగేదేమి లేదని ప్రజలు లబోదిబోమంటున్నారు. బిటిపిఎస్ కాలుష్యంతో మా ప్రాణాలు పోవడానికేనా ఈ ప్లాంట్ ను ఏర్పాటు చేశారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పవర్ ప్లాంట్ నిర్మాణ దశలో సూపర్ క్రిటికల్ వాడకుండా సబ్ క్రిటికల్ తో అధికారులు నిర్మాణం చేయడం వల్లనే ఈ కాలుష్యం వస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ కాలుష్యం ద్వారా వివిధ రకాల వ్యర్ధ పదార్థాలు గోదావరి నదిలో కలవడం వల్ల పశువులు మేతకు వెళ్ళినప్పుడు సైతం నీళ్లు తాగే పరిస్థితులు లేవని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బిటిపిఎస్ కాలుష్యం వల్ల పంటలు దిగుబడి తగ్గడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పవర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టకముందు పంటలు మంచిగా పండేవని కానీ ఈ పరిస్థితి ప్రస్తుతం లేక రైతన్నలు వ్యవసాయం చేసే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు దిగుబడి రాక కౌలు ధరలు కూడా పెరగడంతో వ్యవసాయం అంటే మక్కువ చూపెట్టడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఒక పక్క ఆరోగ్యాలు పాడవడం మరోపక్క పంటలు పండక ప్రజలు తీవ్రమైన సంక్షోభంలో కూరుకపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని కాలుష్యాన్ని నివారించాలని ప్రజలు కోరుతున్నారు.ఇంత జరుగుతున్నాపర్యావరణ అధికారులు జాడెక్కడంటూ పలువురు మేధావులు ఆరోపిస్తున్నారు.

# రహదారులా... ప్రమాద ఘంటికలా...!

**చర్ల, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి ):** చర్ల మండలంలో రోజురోజుకీ ప్రధాన రహదారులు ధ్వంసమై భారీ గుంతలతో మండల వాసులకు వాహనదారుల గుండెల్లో భయాన్ని రేకేతిస్తున్నాయి. ఒకపక్క అధికలోడులతో ఇసుక లారీలు నిత్యం రవాణా సాగించటం వలన రోడ్లు దెబ్బతింటున్నాయి . వర్షాకాలంలో పెద్ద పెద్ద గోతులతో ప్రధాన రహదారి పై నీరు నిండి ఉండటం వలన వాహనదారులు మండల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు . ప్రభుత్వ అధికారులకు ఎన్నిసార్లు తమ గోడు వెళ్ళబుచ్చుకున్న ప్రధాన రహదారి పై మరమ్మతులు చేపట్టటం లేదని భారీ గుంతలతో ప్రమాదాలు జరుగుతూ ఉన్నాయని మండల ప్రజలు అంటున్నారు .నిత్యం కొన్ని వందల ఇసుక ర్యాంపు లారీలు అధిక లోడులతో వెళుతూ ఉండటం మరొక పక్క వర్షాకాలంలో నీటితో రోడ్లు దెబ్బ తినడంతో మండల వ్యాప్తంగా రహదారులు గుంతలమయంతో ఉండటంతో ఇక్కట్లు తెచ్చిపెడుతున్నాయని అంటున్నారు. రహదారులపై భారీ గుంతలు ఏర్పడడంతో లారీలు, ఆటోలు ,మిగతా వాహనాలు కూడా ఆ గుంటలో ఇరుక్కుపోయి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి అనిఅంటున్నారు . మండలంలోని ప్రధాన రహదారులే ఈ రకంగా ఉంటే గ్రామాలలోని రహదారుల పరిస్థితి వర్ణనాతీతం అని కొన్ని రోజుల క్రితం సరైన రహదారి సదుపాయం లేక సత్యనారాయణపురం పరిధిలోని వీరపురంలో నిండు గర్భిణీని బురదతో నిండిన రహదారిపై వైద్యం నిమిత్తం కావిడితో ఆ గర్భిణీ ని మోసుకొచ్చిన ఘటన మన కళ్ళ ముందే కనిపిస్తూ ఉన్నాయని మండల ప్రజలు వాపోతున్నారు . చర్ల, గుంపెనగుడెం, గొంపల్లి,



కొత్తపల్లి, కొత్తూరు, వీరాపురం, ఇలా చెప్పుకుంటూ పోతే మండలంలోని అనేక గ్రామాలలో రహదారుల పరిస్థితి రోజురోజుకీ అధ్వానంగా మారుతున్నాయని అధికారులు రహదారుల మరమ్మత్తుకై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఏమిటని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు . అభివృద్ధి చేస్తామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ కూడా మండలంలోని రహదారులపై దృష్టి పెట్టకపోవడం అధికారులకు విన్నవించుకున్నప్పుడు నిధులు కొరతతో రహదారుల మరమ్మతులు చేయలేకపోతున్నామని చెప్పడంతో మండల వాసులకు ఏమి చేయాలో తెలియని పరి



స్థితి నెలకొన్నది. రాత్రి వేళల్లో వాహనదారులు అత్యవసర పరిస్థితుల నిమిత్తం ఈ రహదారులపై ప్రయాణం ఆదమరిస్తే.. ఆసుపత్రికే.. అన్న చందంగా ఎక్కడ గుంత ఉన్నదో ఎక్కడ చదునైన రోడ్డు ఉన్నదో తెలుసుకోలేని పరిస్థితి అని అంబులెన్స్ వాహనం కూడా వేగంగా వెళ్లలేని పరిస్థితిలో ప్రధాన రహదారులు అధ్వానంగా మారుతున్నాయని మండల ప్రజలు అంటున్నారు . రాష్ట్ర ప్రభుత్వం రహదారుల మరమ్మత్తులకై అధికారులకి నిధులు కేటాయించకపోవడం ఏమిటి అని మీరు నిధులు కేటాయించేదాకా రహదారుల మరమ్మత్తులు అయ్యేదాకా మాకు ఇంకా ఎన్ని ప్రమాదాలు జరగాలని చర్ల వాసులు ప్రశ్నిస్తున్నారు. కనీసం మొత్తం రహదారి నిర్మాణం కాకపోయినా తాత్కాలికంగా రహదారుల మరమ్మత్తుకై గుంతలు పూడ్చే కార్యక్రమం కూడా చేపట్టటం లేదని అటు ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ గాని పంచాయతీ వారు గానీ నిధులు లేవని రహదారుల మరమ్మతులు చేయకపోవడంతో నిత్యం మండలంలో ఏదో ఒక చోట ప్రమాదానికి మండలవాసులు గురవుతున్నారని అంటున్నారు. ప్రతినిత్యం అనేక ప్రభుత్వ కార్యక్రమాలలో భాగంగా చర్ల మండలానికి వచ్చే భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు తెల్లం వెంకటరావు మండల రహదారుల పరిస్థితిని అర్థం చేసుకొని త్వరితగతిన అభివృద్ధి చేయాలని అంటున్నారు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని భద్రాచలం, వెంకటాపురం ప్రధాన రహదారి అలాగే చర్ల మండలంలో రహదారుల సదుపాయం లేని గ్రామాలలో మరమ్మతులు చేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలని ప్రమాదాలు జరగకుండా చూడాలని చర్ల ప్రజలు కోరుతున్నారు.

# యూరియా కోసం రైతుల పాట్లు

- అరకొరగా పంపిణీ చేయడంపై రైతులు ఆగ్రహం
- యూరియా డిమాండ్ మేరకు అదనపు కేంద్రం ఏర్పాటు





**చంద్రుగొండ సెప్టెంబర్ 08 ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాచంద్రుగొండ చంద్రుగొండ మండల రైతు వేదిక నందు గానుగపాడు సహకార సంఘం సొసైటీ ఆధ్వర్యంలో యూరియా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. యూరియా పంపిణీ జరుగుతుందన్న విషయం తెలుసుకున్న రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. తీరా రైతు వేదికలో చూస్తే 113 బస్తాలే ఉన్నాయి. కానీ రైతు వేదిక వద్దకు ఉదయాన్నే 500 మందిపైగా రైతులు రావడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ముందుగా వచ్చిన రైతులకు ఒక్కొక్క బస్తా చొప్పున యూరియా కట్టను అందజేశారు. మిగతా వారికి కూడా సీరియల్ ప్రకారమే మంగళవారం ఇస్తామని చెప్పడంతో మిగతా రైతులు వెను తిరిగి వెళ్లారు. ఇదే విషయంపై మండల వ్యవసాయ శాఖ అధికారి జి వినయ్ మాట్లాడుతూ ... గానుగపాడు సహకార సంఘం సొసైటీ వద్ద రైతులు యూరియా తీసుకోవడం ఇబ్బందికరంగా మారడంతో చంద్రుగొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో అదనపు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కేంద్రంలో సీతాయిగూడెం, దామరచర్ల, మద్దుకూరు, చంద్రుగొండ, తిప్పనపల్లి, బెండాలపాడు, గ్రామాలకు చెందిన రైతుల కు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రెండు కేంద్రాల ద్వారా యూరియాని అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. యూరియా కోసం వచ్చే రైతులు తమ తోపాటు పట్టాదారు పాస్ పుస్తకం లేదా పహాని, ఆధార్ కార్డు జిరాక్స్ తప్పనిసరిగా తీసుకొని రావాలన్నారు.

## మాథ్స్ టీచర్ ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు



**ఇల్లందు, సెప్టెంబర్ 8, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా పాఠశాలలో మ్యాథ్స్ టీచర్ గా పనిచేస్తున్న బి శ్రీనివాసరావు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం జరిగింది. దింతో సోమవారం జియం కార్యాలయంలో జియం వి. కృష్ణయ్య బి.శ్రీనివాసరావును శాలునాతో ఘనంగా సన్మానించి అభినందిచారు. ఈ సందర్భంగా జియం మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సింగరేణి పాఠశాల ఇల్లందు నుండి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని బి. శ్రీనివాసరావు ఉత్తమ మాథ్స్ టీచర్ అవార్డు అందుకోవడం చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, డిజియం (పర్సనల్) అజ్మీర తుకారాం, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ బి. శ్యాం ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి శ్రీనివాసరావు, సీనియర్ ఉపాధ్యాయులు నరసమ్మ, సీతామాలక్ష్మి , స్టాఫ్ సెక్రటరీ ఏ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదురు ధర్నా

- పోడు సాగు చేసుకుంటున్నా గిరిజన , గిరిజనేతరులకు పట్టాలు ఇవ్వాలి
- ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి
- సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా
- రైతు సంఘం రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం




**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 8, ప్రజా జ్యోతి:** ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పార్టీ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు, అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలోని సంబంధిత అధికారులకు అందజేశారు, ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా, రైతు సంఘం రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం లు మాట్లాడుతూ పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజన గిరిజనేతరులకు ట్టాలు ఇవ్వాలని, ఫారెస్ట్ అధికారులు పోడు సాగుదారులపై చేస్తున్న దాడులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు, ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, ముందుగా వికలాంగుల పెన్షన్ 6 వేలు ఇవ్వాలని , వృద్ధాప్య వితంతు ఒంటరి తదితరులకు పెన్షన్ 4 వేలు ఇవ్వాలని, అదేవిధంగా మహిళలకు నెలకు 2500 ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన పేదలందరికీ మంజూరు చేయాలని, వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 12 వేలు ఇవ్వాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 100 రోజుల నుండి 200 రోజులకు పెంచి పని కల్పించాలని, కొలతలతో నిమిత్తం లేకుండా రోజు కూలి 700 రూపాయలు ఇవ్వాలని, 85 సంవత్సరాలు నిండిన పేద రైతులకు నెలకు 6000 పెన్షన్ ఇవ్వాలని, అదేవిధంగా పని సమయంలో ప్రమాదవశాత్తు మరణించిన లేదా అప్పుల పాలై ఆత్మహత్య చేసుకున్న రైతులకు 25 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలని వారు డిమాండ్ చేశారు, సిపిఐ పార్టీ పాల్వంచ మండల అధ్యక్షులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, రైతు సంఘ నాయకులు, ప్రజానాట్యమండలి కళాకారులు, రైతులు వ్యవసాయ కూలీలు తదితరులు పాల్గొన్నారు

## బి సి గురుకుల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో అవకాశం



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 8,ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే బి సి గురుకుల డిగ్రీ మరియు జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారని కళాశాల స్పెషల్ ఆఫీసర్ ఎస్.కె. బురాన్ తెలిపారు. ఆదివారం ఖమ్మం జిల్లా బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి సెలెక్షన్లలో ప్రతిభ కనబరిచిన ఎం.శ్రీహరి, ఎం.రఘు రామ్ (డిగ్రీ ద్వితీయ సంవత్సరం ), ధనుష్, కె.వినయ్ (ఇంటర్ ప్రథమ సంవత్సరం ), ఎం.చరణ్ (ఇంటర్ ద్వితీయ సంవత్సరం ), ఐ.జానకిరామ్ (ఇంటర్ ప్రథమ సంవత్సరం ) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.వీరిని బీ సి గురుకులాల ఆర్‌సిఓ సి హెచ్ రాంబాబు, డీసిఓ బ్యూలా రాణి, కళాశాల స్పెషల్ ఆఫీసర్ ఎస్.కె. బురాన్, ఏటీపీ శ్రీకాంత్, డిప్యూటీ వార్డెన్ మధు, పీడీ డాక్టర్ రఘువరన్, అధ్యాపక బృందం మరియు విద్యార్థులు అభినందించారు.

## ఎస్టి ఉప తెగల మధ్య అనిశ్చిత పరిస్థితిని తెరదించాలి

- లంబాడీల జోలికొస్తే సహించేది లేదు
- లంబాడీల జిల్లా మండల నాయకుల హెచ్చరిక.



**కొత్తగూడెం (కలెక్టరేట్) సెప్టెంబర్ 8, ప్రజా జ్యోతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ ఉప తెగల మధ్య అనిశ్చిత పరిస్థితిని తెరదించాలని నంగారా బేరి లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి గూగుల్ కుషా నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవిలాల్ నాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు గుగులోత్ బద్రు నాయకులు డిమాండ్ చేశారు, సోమవారం పాత మున్సిపల్ ఆఫీస్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 1976లో పార్లమెంటు ఆమోదంతో ఎస్టీ జాబితాలో చేర్చిన ఉప కులాలైన లం బాడి, ఎరుకల, యానాది పేర్లతో కూడిన జాబితాను 9వ తారీఖున సుప్రీంకోర్టు లో సమర్పించాలని వారు డిమాండ్ చేశారు అదేవిధంగా లంబాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేం ద్రంలో నిర్వహించనున్న భారీ ర్యాలీని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు, ఈ ర్యాలీలో జిల్లాలో ఉన్న లంబాడి లు, అన్ని ఉద్యోగ సంఘాలు, జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థి సంఘ నాయకులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు, ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ధరం సోత్ ఉపేందర్ నాయక్, మాజీ ఎంపీటీసీ భూక్య శంకర్ నాయక్, సేవాలాల్ సేన మండల అధ్యక్షులు పరమేష్ ,గూగులోత్ చంటి నాయక్, పాల్గొన్నారు

## గ్రీన్ భద్రాద్రి సేవలు ప్రశంసనీయం



**భద్రాచలం, సెప్టెంబర్ 8,ప్రజాజ్యోతి :** భద్రాచలం మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో గ్రీన్ భద్రాద్రి చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.రోజురోజుకీ పర్యావరణం తీవ్రమైన నష్టాన్ని చవిచూస్తోంది. అడవులు తగ్గిపోవడం, వన్యప్రాణులు అంతరించిపోవడం వెనుక మనిషి స్వార్థమే ప్రధాన కారణం. అయితే గత 14 ఏళ్లుగా గ్రీన్ భద్రాద్రి సంస్థ నిరంతరంగా పచ్చదనాన్ని పెంపొందించే దిశగా కృషి చేస్తూ, పెద్ద మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం ద్వారా భద్రాచలాన్ని పచ్చని హారంగా మార్చిన ఘనత గ్రీన్ భద్రాద్రికే దక్కుతుంది” అని ఆయన ప్రశంసించారు.భవిష్యత్తులో కూడా గ్రీన్ భద్రాద్రి మరిన్ని పర్యావరణ హిత కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షిస్తూ, సంస్థకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షురాలు చిట్టే లలిత, కో ఆర్డినేటర్ పామరాజు తిరుమలరావు, పాస్ట్ ప్రెసిడెంట్ జి.యస్. శంకరరావు, బోగాల శ్రీనివాసరెడ్డి, కామిశెట్టి కృష్ణార్జునరావు, ముబ్వా దమయంతి, కుంచాల రాజారామ్, అడబాల వెంకటేశ్వరరావు, రాసమళ్ళ రాము, ఏ. రామిరెడ్డి, ప్రియాంక, సురేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలో పురస్కరించుకొని అభిషేకాలు, మహా అన్నదానం



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 8, ప్రజాజ్యోతి:** అ న్నపురెడ్డిప ల్లి మండల కేంద్రంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి శివాలయంలో సోమవారాన్ని పురస్కరించుకొని విశేష కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. భక్తిపూర్వకంగా అభిషేకాలు, గోత్రనామార్చనలు జరగగా, అనంతరం మహా అన్నదాన కార్యక్రమం వైభవంగా జరిగింది.ఈ మహా అన్నప్రసాద సేవలో రామచంద్రాపురం గ్రామస్తులు గాజుల హైమావతి కుటుంబ సభ్యులు, పల్లె రామకృష్ణ–ప్రియాంక దంపతులు యాతాలకుంటవారు భాగస్వాములై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. గ్రామస్థులు, సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొని మహా ప్రసాదాన్ని స్వీకరించారు.ఆలయ చైర్మన్ మల్యాల నరసింహారావు ఆధ్వర్యంలో, ఆలయ మేనేజర్ పి.వి. రమణ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయి.

## ఘనంగా కాంగ్రెస్ నాయకులు రొకటి సురేష్ అంత్యక్రియలు

- నిజాయితీ నాయకుడిని కోల్పోయాం
- ఎమ్మెల్యేలు సాంబశివరావు
- రామదాసు నాయక్.



**జూలూరుపాడు,సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి ) :**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల పరిధిలోనిపాపకొల్లు మాజీ ఎంపీటీసీ కాంగ్రెస్ పార్టీ నాయకులు రొకటి సురేష్ మరణం పట్ల సిపిఐ కొత్తగూడెం శాసనసభ్యులు కూనం నేనీ సాంబశివరావు, వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్ ప్రగాఢ సానుభూతి సంతాపం తెలియజేశారు. వీరితోపాటు అఖిలపక్ష నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు పాపకొల్లులో సోమవారం జరిగిన సురేశ్ పార్థివ దేహం అంతిమ యాత్రలో పాల్గొని వారు మాట్లాడుతూ పాపకొల్లు అభివృద్ధి కోసం ఆయన కృషి ఎనలేనిదని , పేద ప్రజల పక్షాన నిలబడే నిబద్ధత నిజాయితీ గలిగిన నాయకుడిని కోల్పోయామని వారి కుటుంబంతో నాకు ఎన్నో ఏళ్లుగా అనుబంధం ఉందని వారి మరణం పట్ల సిపిఐ పక్షాన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలిపారు.వారి వెంట వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్, వైరా మాజీ శాసనసభ్యులు బానోత్ చంద్రావతి, వైరా నియోజకవర్గ నాయకులు బాబు, జూలూరుపాడు మాజీ జెడ్పిటిసి భూక్య కళావతి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లేళ్ళ వెంకటరెడ్డి, జూలూరుపాడు మాజీ ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన్ రావు, ఏన్కూర్ మాజీజడ్పిటిసి శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, మార్క్ రాష్ట్ర వైస్ చైర్మన్ బుర్ర రాజ శేఖర్ తదితర నాయకులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

## సీతారాం ఏచూరికి ఘన నివాళి



**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 8(ప్రజాజ్యోతి):**దేశంలో రోజురోజుకీ పెరిగిపోతున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేసి ప్రజా పోరాటాలను నిర్మించడమే సీతారాం ఏచూరి కి ఇచ్చే నిజమైన నివాళి అని సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి స్పష్టం చేశారు.సోమవారం పట్టణంలోని అశోక్ నగర్ కాలనీలో 11వ వార్డ్ సిపిఐఎం కమిటీ ఆధ్వర్యంలో మాజీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంబీ నర్సారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టినట్టిన నాటి నుండి జీఎస్టీ పేరుతో ప్రజలపై భారాలు మోపి ఇప్పుడు వాటిని సవరిస్తున్నాం అనటం విడ్డూరంగా ఉందని అన్నారు. ఇన్ని సంవత్సరాలు లక్షల కోట్ల ధనాన్ని జిఎస్టి రూపంలో ప్రజల రక్తాన్ని పిలిచి వసూలు చేసి అంబానీ అదాని సంస్థలకు దోచి పెట్టారని ఆరోపించారు. అడ్డదారిలో దోచుకుంటూ ప్రజలకు తెలియకుండా మతం మత్తు చల్లి ప్రజలలో మధ్య చీలికలను సృష్టించి రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. బిజెపికి వ్యతిరేకంగా ఇండియా కూటమి ఏర్పాట్లు సీతారాం ఏచూరి కీలకంగా వ్యవహరించారని అటువంటి మహానాయకుడు మన మధ్యన లేనప్పటికీ సీతారాం ఏచూరి ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. కేంద్రం బాటలోనే రాష్ట్ర సర్కారు సైతం పయనిస్తూ ప్రజలపై మోయలేని భారాలు మోపుతున్నారని అన్నారు. రైతులకు యూరియా కూడా సరిగ్గా అందించలేని పాలకులు రైతులను ఎలా ఉద్ధరిస్తారో చెప్పాలని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీ ల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. సిపిఐ ఎం ఆధ్వర్యంలో గత రెండు నెలలుగా మాస్ లైన్ కార్యక్రమాన్ని చేపట్టి స్థానిక సమస్య పరిష్కారం కోసం పోరాటాలను నిర్వహిస్తున్నామని పట్టణ వ్యాప్తంగా పేరుకుపోయిన సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలను రూపొందిస్తున్నామని నర్సారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సీనియర్ సభ్యులు రౌతు గణపతమ్మ, పిలక శివకుమారి పూలమాల వేసి నివాళులు అర్పించగా పట్టణ కార్యదర్శి కుమార్ శాఖ కార్యదర్శి పుణ్యవతి సభ్యులు సావిత్రమ్మ, స్వరూప, సూరమ్మ, వెంకటేశ్వరరావు, కుమారి లక్ష్మి , సరోజ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగాఎమ్మెల్యే కోరం జన్మదిన వేడుకలు

- ప్రధాన కూడళ్ళలో కేక్ లు కట్ చేసి సంబురాలు
- రక్తదాన శిబిరం నిర్వహణ
- కాంట్రాక్టు మహిళ కార్మికులకు చీరల పంపిణి
- ఆటో డ్రైవర్స్ కు కాకి చొక్కాల అందజేత.








**ఇల్లందు, సెప్టెంబర్ 8, ప్రజాజ్యోతి:** ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకలను సోమవారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ళలో స్టేజీలను ఏర్పాటు చేసి జన్మదిన కేకులను కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేస్తూ సంబురాలు జరుపుకున్నారు. పట్టణంలోని సీఎస్పి బస్తీలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పట్టణం, మండలంలో నీ మీద విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు మహిళా కార్మికులకు చీరలు, ఆటో డ్రైవర్లకు కాకి చొక్కాలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద భారీ కేకును కట్ చేసి సుమారుగా 2000 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. యంపిడిఓ కార్యాలయంలో మైనార్టీ పథకం క్రింద మంజూరైన మైనార్టీ సోదరీమణలకు ఎమ్మెల్యే కుట్టు మిషన్లను పంపిణి చేయడం జరిగింది. ఎమ్మెల్యే కోరం కనకయ్యను గజమాలతో పార్టీ శ్రేణులు, అభిమానులు ఘనంగా సన్మానించారు. తమ అభిమాన నేత, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య నిత్యం ప్రజాసేవలో ఉంటూ, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్, ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మన్ బానోత్ రాంబాబు, హరి హర క్షేత్ర ఆలయ కమిటీ చైర్మన్ గందె సదానందం, సీనియర్ నాయకులు మండల రాము, మడుగు సాంబమూర్తి, భోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొల్లి రాజు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఈసం లక్ష్మణ్, నాయకులు జాఫర్, ఎస్. కె. జానీ, యండి. ఇబ్రహీమ్, గోచికొండ సత్యనారాయణ, గోచికొండ శ్రీదేవి, నంద కిషోర్, సుదర్శన్ కోరి, మాజీ వైస్ చైర్మెన్ జానీ పాషా, మాజీ కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతాంగానికి అవసరమైన యూరియాను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సరఫరా చేయాలి

- ఏఐయుకేఎస్ జాతీయ కన్వీనర్ కెచ్చెల రంగారెడ్డి




**కొత్తగూడెం( కలెక్టరేట్ ) సెప్టెంబర్ 8, ప్రజా జ్యోతి:**రైతాంగానికి అవసరమైన యూరియాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలు వెంటనే సరఫరా చేయాలని, ఇటీవల కురిసిన అధిక వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేల రూపాయల నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు, ఈ సందర్భంగా అఖిలభారత ఐక్య రైతు సంగం జాతీయ కన్వీనర్ కెచ్చెల రంగారెడ్డి, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య లు మాట్లాడుతూ పత్తి పంటకు కనీస మద్దతు ధర రూ. 10,075 లు నిర్ణయించాలని, నూతన వ్యవసాయ మార్కెట్ విధానాన్నిఉపసంహరించుకోవాలని, వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్ధతు ధరల చట్టాన్ని చేయాలని వారు డిమాండ్ చేశారు, గిరిజనులు, ఇతర పేదలు సాగు చేసుకుంటున్న పోడుభూములలో పంటలను అటవీ అధికారులు ధ్వంసం చేయాడాన్ని నిలిపివేయాలని, పంటలు ధ్వంసం చేసిన అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఎన్నో సంవత్సరాలుగా పోడు సాగు చేసుకుంటున్న రైతులకు ప్రభుత్వం సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వలేదని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం సాగుదారులందరికి పోడు భూములుకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు, పత్తి దిగుమతిపై కేంద్ర ప్రభుత్వం 11 శాతం దిగుమతి సుకాన్ని తగ్గించటాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రైతాంగానికి అవసరమైన యూరియా సరఫరా చేయటంలో విఫలమైనదని, రాష్ట్రానికి రావాల్సి ఉన్న 9.80 లక్షల మెట్రిక్ టన్నులలో కేవలం 5.50 లక్షల మెట్రిక్ టన్నుల మాత్రమే సరఫరా చేసిందని, 3 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా యూరియా కొరతా ఏర్పడిందని అన్నారు రాష్ట్రంలో వరి, పత్తి మొక్కజొన్న, వంటలకు యూరియా అవసరం, సకాలంలో యూరియాను పోలాలకు వేసుకోలేని పక్షాన పంటలు వేపుగా పెరగవని, దాని వలన దిగుబడి తగ్గిపోతుందన్నారు , అనంతరం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్ద భిక్షం, అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా కార్యదర్శి అమర్లపూడి రాము మాట్లాడుతూ ఇటీవల కురిసిన అదిక వర్షాల వలన రాష్ట్రంలో 13 జిల్లాలలో వరద తాకిడికి గురై పంటలు దెబ్బతిని రైతుల పంటలు నష్టపోవడం జరిగిందని , పంటలు నష్టపోయినా రైతాంగానికి ఏకరాకు 50 వేల రూపాయలు సష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు , ఈ కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బుర్ర వెంకన్న, కల్లూరి కిషోర్, మాచర్ల సత్యం, బానోత్ ధర్మ, గోగ్గేల వెంకటేశ్వర్లు, పందూరి వీరబాబు, నకిరకంటి నాగేశ్వరరావు, రాయబారపు వెంకటేశ్వర్లు, టీయుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి నూపా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన ఉత్సవాల భద్రతా చర్యలు కట్టుదిట్టం: సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట



**భద్రాచలం, సెప్టెంబర్ 8,ప్రజాజ్యోతి :**తొమ్మిది రోజులపాటు జరుపుకున్న వినాయక నవరాత్రుల అనంతరం భద్రాచలంలోని గోదావరిలో వినాయక నిమజ్జన ఉత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయని . వివిధ జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుండి కూడా వినాయక ప్రతిమలు నిమజ్జనానికి తరలి వస్తుండటంతో భద్రాచలంలో భక్తుల సందడి నెలకొంది. రేపటితో నిమజ్జన కార్యక్రమం పూర్తవుతుందని భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట తెలిపారు.సోమవారం గోదావరి కరకట్ట వద్ద నిమజ్జన ప్రదేశాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు, పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో సమన్వయం చేసుకుని కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామని తెలిపారు. భారీ వినాయక ప్రతిమలను క్రేన్ సహాయంతో నిమజ్జనం చేసే సమయంలో భక్తులు, ప్రేక్షకులు భద్రతా రేఖ దాటకూడదని హెచ్చరించారు. 20 అడుగులకుపైనున్న విగ్రహాలను సురక్షితంగా నిమజ్జనం చేయాలని ఎన్డీఆర్ఎఫ్ బృందానికి ప్రత్యేక సూచనలు ఇచ్చారు.అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించి భక్త మండలి సభ్యులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్ఓ చైతన్య, ఇరిగేషన్ డీఈ మధు, ఏఈ వెంకటేశం, ఎన్వీఐ వెంకట పుల్లయ్య, జిపిఇఓ శ్రీనివాస్, ఎన్డీఆర్ఎఫ్ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టుబడిన వాహనాలకు నేడు పాల్వంచ ఎక్సైజ్ కార్యాలయంలో వేలం

**కొత్తగూడెం (కలెక్టరేట్ ) సెప్టెంబర్ 8, ప్రజా జ్యోతి:**పలు కేసులలో పట్టుబడిన ఆరు వాహనాలను ఈనెల 10వ తేదీన ఉదయం 11 గంటలకు పాల్వంచ ఎక్సైజ్ స్టేషన్లో వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జనార్దన్ రెడ్డి సోమవారం తెలిపారు, వేలం పాటకు ఉన్న వాహనాలైనా బజాజ్ ఆటో, హీరో హోండా ప్యాషన్ ప్రో, హోండా షైనీ సిబి 125, హీరో హోండా స్ప్లెండర్ ప్లస్, కెటిఎమ్ బైక్, హెచ్ఎఫ్ డీలక్స్ వాహనాలు ఉన్నాయని, ఈ వాహనాలు అన్ని కండిషన్లో ఉన్నాయని తెలిపారు, ఆసక్తి గలవారు నిర్ణీత 25 శాతం చెల్లించి ధరావత్ డబ్బులు డిపాజిట్ చేసి రసీదు పొందాలని కోరారు.

# ప్రజా ఫిర్యాదులపై వేగవంతమైన స్పందన

- ప్రతి సోమవారం మండల ప్రజావాణి.



**భద్రాచలం, సెప్టెంబర్ 8,ప్రజాజ్యోతి** :ప్రజల సమస్యలు గ్రామాల దగ్గరలోనే పరిష్కరించడానికి భద్రాచలం డివిజన్‌లో మండల ప్రజావాణి కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అమలు చేస్తున్న ఈ కొత్త విధానం ద్వారా ఇకపై ప్రతి సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00గంటల వరకు అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం జరుగనుంది.ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్థులు తమ సమస్యల పరిష్కారం కోసం సబ్–డివిజన్ లేదా జిల్లా ప్రధాన కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా చేయడం లక్ష్యం. మండల స్థాయిలో పరిష్కరించగల సమస్యలను స్థానికంగానే తేల్చడం వల్ల ప్రజల ప్రయాణ సమయం, ఖర్చులు గణనీయంగా తగ్గనున్నాయి.మండల ప్రజావాణి కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ఒకే వేదికపై కూర్చొని పౌరుల ఫిర్యాదులను స్వీకరిస్తారు. సాధ్యమైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే చర్యలు తీసుకుంటారు. వెంటనే తేల్చలేని వాటికి స్పష్టమైన గడువు నిర్ధేశించి, అవసరమైతే ఉన్నతాధికారులకు పంపించి తదుపరి చర్యలు చేపడతారు.అంతేకాక, మండల స్థాయిలో లభించిన పరిష్కారం పట్ల అసంతృప్తిగా ఉన్న పౌరులు నేరుగా ఉన్నతాధికారులను సంప్రదించే అవకాశం కూడా కలిగి ఉంటారు. అధికారులు ఈ విధానం పౌరులకు సౌలభ్యాన్ని కల్పించడమే కాకుండా సమస్యల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేస్తుందని తెలిపారు.ప్రత్యేకంగా వృద్ధులు దివ్యాంగులకు ఈ కార్యక్రమంలో ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ప్రజలు ఇకపై తమ హక్కులు, సమస్యలు సులభంగా వినిపించుకోవడానికి ఈ వేదిక సదుపాయం కల్పించనుంది.

## లంబాడీ ఆత్మగౌరవ ర్యాలీ విజయవతం




**టేకులపల్లి, సెప్టెంబర్08, ప్రజాజ్యోతి:** మండల కేంద్రంలో లంబాడీల ఆత్మగౌరవ ర్యాలీ లంబాడి జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. టేకులపల్లి మండల మహా ర్యాలీ భూక్య లాలు నాయక్, మూడ్ హుస్సేన్ నాయక్, ధరావత్ ప్రేమ్చంద్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ర్యాలీ తూర్పు సేవాలాల్ మహారాజ్ ఆలయం నుంచి ఎంపీడీఓ ఆఫీస్ వరకు చేరుకొని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్,రాష్ట్ర జాక్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రెండు గిరిజన తెగల మధ్య నేలకొన్న గొడవలను రాష్ట్ర ప్రభుత్వం తెరదించాలని వారు కోరారు. 1976లో చేర్చబడ్డ ఎస్టి ఉప తెగలు (లంబాడి, ఎరుకల, యానది, ఆంద్ )తెగల పేర్లను సుప్రీంకోర్టుకు ప్రభుత్వం సమర్పించాలని వారు కోరారు. రాజకీయ లబ్ది కోసమే లంబాడీ గోండు, కోయ తెగల మధ్య చిచ్చు పెడుతున్నరని వారి ప్రయత్నాలను మానుకోవాలని వారు హెచ్చరించారు. ఇలా రెండు గిరిజన జాతులకు చిచ్చుపెట్టాలని చూస్తే వారిని వదిలిపెట్టే సమస్య లేదని వారు తెలిపారు. లంబాడి జాతి బిడ్డలకు న్యాయం జరిగేలా ఎన్ని పోరాటాలనికైనా సిద్ధమని వారు తెలిపారు. అన్నదమ్ములుగా ఉంటున్న జాతులలో సొంత స్వలాభం కోసం చిచ్చుపెట్టి పబ్బం గడుపుతున్నారని వారు ఆరోపించారు. అలా చిచ్చుపెట్టే వారికి దేవుడనేవాడు ఏదో ఒక రోజు శిక్ష వేస్తాడని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్, బోడ పుణ్య నాయక్,గుగులోతు రాజేష్ , భూక్యా రవి రాథోడ్, కిషన్ నాయక్, బానోత్ రామానాయక్, మాలోత్ సురేందర్ నాయక్,వాంకుడోత్ హాతిరాం నాయక్, భూక్య పాపా నాయక్, సురేష్ నాయక్, భూక్య సైదులు, రమేష్నాయక్, భూక్య కిషోర్ సింగ్ నాయక్, మంగీలాల్, గణేష్ మహారాజ్,కిషన్ నాయక్, మూడ్ అనిల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ఖరారుకు రాజకీయ పార్టీ నాయకులతో కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సమీక్ష సమావే శం






**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 8, ప్రజా జ్యోతి:** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం రెండవ సాధారణ ఎన్నికలు ( ఎంపీటీసీ/ జెడ్పిటిసి – 2025) నిర్వహణలో భాగంగా, మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారాల కోసం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ కోసం తయారుచేసిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ,పోలింగ్ స్టేషన్లో జాబితాను రాజకీయ పార్టీ నాయకులకు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 471 పంచాయతీలలో మొత్తం 6,69,048 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 3,25,045, మహిళలు 3,43,979 మంది కాగా 24 మంది ఇతరులు ఉన్నారని తెలిపారు.4168 వార్డులకు గాను 4242 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేందుకు సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారని కలెక్టర్ తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు చేసుకోవడం కోసం ఇప్పుడే దరఖాస్తు చేసుకోవాలని, నోటిఫికేషన్ వెలువడిన తర్వాత కొత్త పేర్లు చేర్పులు ఉండబోవని కలెక్టర్ స్పష్టం చేశారు. ఒక గ్రామం నుండి మరొక గ్రామానికి ఓట్లు బదిలీ చేయడం సాధ్యం కాదని తెలిపారు. ఇప్పటివరకు గుర్తించిన పోలింగ్ కేంద్రాలు యధాతరంగా కొనసాగుతాయని, వాటిలో ఎటువంటి మార్పులు ఉండవని, ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు, ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డిప్యూటీ జెడ్పి సీఈవో చంద్రశేఖర్ , ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ బాల ప్రసాద్, భారతీయ రాష్ట్ర సమితి అనుదీప్, సిపిఐ ఎస్ శ్రీనివాస్, సిపిఎం ఏ సత్యనారాయణ, భారతీయ జనతా పార్టీ , నోముల రమేష్, ఆమ్ ఆద్మీ పార్టీ ఏ. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఫోటో ట్రేడ్ ఎక్స్పో పోస్టర్ ఆవిష్కరించిన భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్




**కొత్తగూడెం (కలెక్టరేట్) సెప్టెంబర్ 8:** ప్రజా జ్యోతి :తెలంగాణ రాష్ట్ర ఫోటో గ్రాఫర్ ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 19, 20, 21, వ తేదీలలో హైదరాబాద్ లో నిర్వహించే ఫోటో ట్రేడ్ ఎక్స్పో – 2025 పోస్టర్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం ఐడిఓసి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కీసర సుధాకర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి వనచర్ల రామకృష్ణ తో పాటు ఫోటో గ్రాఫర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ, ఫోటోగ్రఫీ రంగం ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వేగంగా అభివృద్ధి చెందుతోందని, యువత ఈ రంగంలో మంచి అవకాశాలను పొందుతారని అన్నారు ,ప్రస్తుతం ఏఐ టూల్స్ వలన ఫోటో గ్రఫీ రంగంలో కూడా మార్పులు వచ్చాయని దీనికి అనుగుణంగా ఫోటో గ్రాఫర్ లు మెలుకువలు నేర్చుకోవాలని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ నుంచి డ్రోన్ టెక్నలిజీ పై నేర్చుకోవాలని ఎవరికైనా ఉత్సాహం ఉంటే ప్రభుత్వం తరపున ట్రైనింగ్ ఇప్పించడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అదే విధంగా ఫోటో గ్రాఫర్ లకు అవసరమైన వర్కషాప్ లు నిర్వహించాలను కుంటే ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహకరిస్తామని తెలిపారు.పాల్వంచ మండల అధ్యక్షులు జిల్లపెల్లి నాగరాజు, కొత్తగూడెం ప్రధాన కార్యదర్శి తెలంగాణ శంకర్, కోశాధికారి గాయత్రి ప్రభాకర్, జిల్లా కమిటీ సభ్యులు మస్తాన్ వలీ, నామా నరేష్, హరి నారాయణ , రవికుమార్, కార్తీక్, స్థానిక ఫోటో గ్రాఫర్ లు పాల్గొన్నారు.

## గణపతి నవరాత్రి అన్న వితరణ



**టేకులపల్లి, సెప్టెంబర్ 08,ప్రజాజ్యోతి:** గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా టేకులపల్లి క్రాస్ రోడ్ గణేష్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అన్న వితరణ ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య సతీమణి కోరం లక్ష్మి హాజరై అన్న వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అన్ని దానాలో కన్నా అన్నదానం ఎంతో గొప్పదని, ఒక మంచి పని చేయడం వల్ల వచ్చేదా పేరు, అన్నదానం చేయడం వల్ల రెండింతల మంచి పేరు వస్తుందని వారన్నారు. గత 18 సంవత్సరాల నుంచి టేకులపల్లి క్రాస్ రోడ్డులో వినాయక నవరాత్రులు నిర్వహించుకుంటూ మహా అన్నదాన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా, ఎటువంటి అడ్డంకులు లేకుండా సజావుగా నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. భక్తులు తండోపతండాలుగా వచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు రాయల ప్రశాంత్, ఎనగందుల రామకృష్ణ, గుడిపూడి మోహన్ రావు,ఎట్టి బాలరాజు, గుడిపూడి సత్యనారాయణ,మంగ్యా, రామ శేఖర్, భానుచందర్, జయంత్, శ్రావణ్, నరేష్, యూత్,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టుల కుట్ర భగ్నం

- పది కిలోల ఐఈడి బాంబు నిర్వీర్యం .





**చర్ల, సెప్టెంబర్ 08:** (ప్రజా జ్యోతి ):తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ బీజాపూర్ జిల్లాలోని థానా గంగలూరు ప్రాంతంలోని డి ఆర్ జి బీజాపూర్, సి ఆర్ పీ ఎఫ్ 222 బృందం చెర్పాల్, పెద్దకోర్మ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కు వెళ్లింది. ఈ ఆపరేషన్ సమయంలో విద్యుత్ తీగ కనిపించినప్పుడు చుట్టుపక్కల ప్రాంతాన్ని తీవ్రంగా శోధించారు. సోమవారం ఈ శోధన సమయంలో స్టీల్ టిఫిన్ లో దాదాపు పది కిలోల బరువున్న ఐ ఈ డి మూడు కిలోల బి జి ఎల్ సెల్ ముక్క వరుసగా అమర్చబడి ఉండటంతో బయటపడింది. స్వాధీనం చేసుకున్న ఐ ఈ డి ని బీజాపూర్ బి డి ఎస్ సి ఆర్ పీ ఎఫ్ 222 బెటాలియన్ బి డి బృందం జాగ్రత్తగా సురక్షితంగా అక్కడికక్కడే నిర్వీర్యం చేశాయి.

## ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ



**దమ్మపేట, సెప్టెంబర్ 8,(ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలం, దుర్గం గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం వేడుకలు ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి సి.హెచ్. చంద్రకళ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ విద్య అనేది మనిషిని అంధకారం నుండి వెలుగుకి తీసుకెళ్లే దివ్య దీపం అని ,అక్షరాస్యత జీవితాన్ని మారుస్తుందని, ప్రతీ ఒక్కరూ చదవాలి, చదివించాలి అని విద్య యొక్క ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయలు మాట్లాడుతూ, విద్యా విలువలపై తమ అభిప్రాయాలు పంచుకున్నారు. కార్యక్రమలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి గ్రామస్థులకు అక్షరాస్యత గురించి అవగాహన కల్పించారని తెలియజేసారు.ఈ కార్యక్రమం విద్యార్థులలో చదువు పట్ల ఆసక్తిని పెంపొందించడమే కాక, సమాజంలో విద్యాభివృద్ధికి చేయూతనిచ్చే దిశగా చక్కటి ప్రేరణను అందించింది తెలియజేసారు.ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## మండల స్థాయి టి.ఎల్.ఎం మేళ

- ముఖ్యఅతిథిగా ఎంపీడీవో బి.రవీందర్ రెడ్డి



**దమ్మపేట, సెప్టెంబర్ 8, (ప్రజాజ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలం, పట్వారిగుడెం జిల్లా పరిషత్ పాఠశాలలో, మండల విద్యాశాఖ అధికారి శ్రీమతి కీసరీ లక్ష్మి ఆధ్వర్యంలో, మండల స్థాయి టి.ఎల్.ఎం మేళ ఏర్పాటు చేయడం జరిగింది.మండల విద్య శాఖ అధికారి మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో బి.రవీందర్ రెడ్డి ని ఆహ్వానించడం జరిగిందని, ఈ మేళాలో అందరూ ఎంతో ఉత్సహంగా పాల్గొన్నారని తెలిపారు. ఈ మేళ లో మొదటి ,రెండవ స్థానాల్లో గెలుపొందిన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు మండల విద్య శాఖ అధికారి బహుమతులు అందచేయటం జరిగిందని, తెలుగు,ఇంగ్లీష్,మాథ్స్, ఈవీఎస్ సబ్జెక్టు నందు మొదటి, రెండవ స్థానాలు తెలియజేయడం జరిగిందని, వీరు మరల జిల్లా స్థాయిలో, సెప్టెంబర్ 10వ తారీఖున జరగబోయే పోటిలో పాల్గొనవలసి ఉంటుదని మండల విద్యా శాఖ అధికారి కీసర లక్ష్మి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండలలోని ప్రధానోపాధ్యాయులు పి. జగపతయ్య , రామకృష్ణారెడ్డి, టి. ఉషారాణి, ఆర్ మారెమ్మ, బి.సరళ, ఉపేందర్ రెడ్డి, వివిధ సంఘుల నాయకులు ఆర్.రమేశకుమార్,ఎస్ఎస్సి ప్రసాద్, సురేష్, చెన్నారావు, ప్రసాద్, రాందాస్ ఉన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకలు



**టేకులపల్లి, సెప్టెంబర్08, ప్రజాజ్యోతి:** ఎమ్మెల్యే కోరం కనకయ్య పుట్టిన రోజు వేడుకలను టేకులపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అభిమానుల, పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య కేక్ కట్ చేశారు. అనంతరం టేకులపల్లి ఎక్స్ రోడ్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోరం కనక జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ ఎమ్మెల్యే కి కేక్ తినిపిస్తూ శుభాకాంక్షలు తెలియచేసారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తనపై చూపించిన అభిమానానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్, మండల అధ్యక్షులు దేవా నాయక్, నాయకులు ఈది గణేష్, పిఎసిఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్, పోశాలు, రెడ్యానాయక్, మధురెడ్డి, భద్రు నాయక్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు బండ్ల రజినీ, మహాలక్ష్మి, సరిత, చంద్రకళ, కాలే ప్రసాద్, నర్సింగ్ లక్ష్మయ్య, ఊళ్ళోజి ఉదయ్, తిరుపతి, బొడ్డు అశోక్, భూక్యా సర్దార్, బానోత్ రవి, రాందాస్, ముచ్చా సుధాకర్, హనుమంతు, శ్యామ్, మూడ్ గణేష్, సుధీప్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా



**దమ్మపేట, సెప్టెంబర్ 8, (ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని, మందలపల్లిగ్రామం, గాంధీనగరం వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీ AP39WF7999 ని దమ్మపేట పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దమ్మపేట పోలీస్ వారు తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం సాయంత్రం ఐదు గంటల సమయములో పోలిస్ వారు మందలపల్లి గ్రామ పరిధిలోని గాంధీనగరం వద్ద పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామం కు చెందిన షీర్ల అమ్మిరాజు, తండ్రి వెంకటేశ్వరరావు, కర్రిబేది గనిరాజు, తండ్రి సుబ్బారావు అను వారు తెలంగాణ ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా 20 టన్నుల ఇసుక లోడ్ తో గాంధీనగరం వైపు వెళుతున్న టిప్పర్ లారీ ని అదుపులోకి తీసుకుని, పంచనామా నిర్వహించి Cr.No.221/2025, U/S 318(4) కేసు నమోదు చేసి ఇసుక లారీ ని స్వాధీనం చేసుకున్నారని దమ్మపేట ఎస్ ఐ సాయి కిషోర్ రెడ్డి తెలియ జేశారు.

# ఏటీసీ ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 8, ప్రజాజ్యోతి:** ప్రభుత్వం కల్పించే అవకాశాలను యువత అందిపుచ్చుకొని తమ భవిష్యత్తును బలోపాతం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ మణుగూరు ప్రభుత్వ ఐటిఐ కళాశాల, ఏటీసీ సెంటర్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఏటీసీ భవన సముదాయాన్ని పరిశీలించారు. ఐటిఐ లను ఆధునీకరించే క్రమంలో ఏటీసీలను ఏర్పాటు చేశామని, వీటిలో శిక్షణ పొందిన విద్యార్థులకు పారిశ్రామిక రంగంలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఏటీసీ శిక్షణ పూర్తి చేసిన ప్రతి విద్యార్థికి వివిధ పరిశ్రమంలో ఉద్యోగ అవకాశాలను కల్పించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. విద్యార్థులు శిక్షణ కాలంలో కష్టపడి చదివి సంపూర్ణ నైపుణ్యాన్ని పొందాలని, వారికి కావలసిన పుస్తకాలను ఉచితంగా అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. ఐటిఐ లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్. విద్యార్థులకు కావలసిన అన్ని సౌకర్యాలు పరికరాలు కల్పించాలని దానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించి నివేదికలు అందజేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మణుగూరు తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో తెలంగాణ 11వ ఎన్ సి సి ఖమ్మం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎన్సిసి క్యాంపును సందర్శించారు. నేడు ప్రారంభమైన ఈ ఎన్ సి సి క్యాంపు 17వ తారీఖు వరకు పది రోజులు పాటు నిర్వహించడం జరుగుతుందని ,700 మందితో ఈ క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్యాంప్ కమాండెంట్ కల్నల్ సంజయ్ కుమార్ భద్ర, క్యాంప్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కల్నల్ నవీన్ యాదవులను కలిసి క్యాంపు వివరాలు, శిక్షణ, శిక్షణానంతరం ఉద్యోగ అవకాశాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్యాంపు సజావుగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. క్యాంపు ప్రదేశంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్సిసి శిక్షణ ద్వారా క్రమశిక్షణ, నాయకత్వం , దేశ సేవ వంటి విలువలు పెరుగుతాయన్నారు. జిల్లాలో రథం గుట్ట వంటి సహజ సౌందర్య ప్రదేశాలను ఎన్సిసి అడ్వెంచర్ క్యాంపులకు వినియోగించుకోవచ్చని, దీని ద్వారా జిల్లా పర్యాటక రంగంలో మరింత ప్రాధాన్యతను పొందుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీఓ వెంకటేశ్వరరావు ఐటిఐ సూపర్డెంట్ జ్యోతిరాణి, ఏటీవోలు జీ.వీ కృష్ణారావు, వేణుగోపాల్ , ఏటీసీ సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ అభివృద్ధికి పాటుపడతాం

- సొసైటీ ఎన్నికలలో 1535 అభ్యర్థులను గెలిపించండి సెంట్రల్ కమిటీ అధ్యక్షులు : ఎంఏ వజీర్
- ఉద్యోగుల కార్మికుల హక్కులకై పోరాడుతా : సిద్దెల హుస్సేన్



**మణుగూరు, సెప్టెంబర్ 08, (ప్రజా జ్యోతి ) :** బిటిపిఎస్, కేటిపిఎస్, వైటిపిఎస్ సొసైటీ ఎన్నికలలో డైరెక్టర్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ 1535 ప్యానల్ అభ్యర్థులను గెలిపించాలని, సొసైటీ అభివృద్ధికి పాటుపడతామని సెంట్రల్ కమిటీ అధ్యక్షులు ఎంఏ. వజీర్ కోరారు. అభ్యర్థుల గెలుపుకై ప్రచారంలో భాగంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని బిటిపిఎస్ లోని గౌరవ సభ్యులను ఉద్దేశించి ఎంఏ.వజీర్ మాట్లాడారు. కేటీపీఎస్ క్రెడిట్ సొసైటీలో నాలుగు పర్యాయాలుగా 1535 యూనియన్ బలపరిచిన అభ్యర్థులే విజయం సాధించారని అన్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా 1535 యూనియన్ అభ్యర్థులే ఉన్నారని తెలిపారు. సొసైటీని నేటికీ అభివృద్ధి పథాన నడిపిస్తున్నారని తెలిపారు. సెప్టెంబర్ 10న బుధవారం జరిగే ఎన్నికలలో 1535 యూనియన్ ప్యానల్ లోని అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా గెలిచిన అభ్యర్థులంతా పని చేశారని భవిష్యత్తులో సంఘాల అభివృద్ధికై పని చేయాలంటే ఈ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. అన్యాయంపై తన గలాన్ని వినిపిస్తూ సమస్యలపై ప్రశ్నిస్తారని తెలిపారు. డిపాజిట్ దారులకు జవాబుదారీగా ఉంటారని, సకాలంలో సభ్యులకు రుణాలు మంజూరు చేయించే విధంగా చర్యలు తీసుకుంటారని అన్నారు. సభ్యుల ఆర్థిక ప్రగతికై పాటుపడతారని సొసైటీని మరింత అభివృద్ధి చేస్తారని తెలియజేశారు. జనరల్ కేటగిరి నుండి పోటీ చేస్తున్న సిద్దెల హుస్సేన్ (క్యాలిక్యులేటర్), దానం నరసింహారావు (పలక), బండి నాగరాజు (బుట్ట ), తుమ్మురి విజయ్ కుమార్ (కత్తెర), వల్లమల్ల ప్రకాష్ (బ్రష్ ), దాసరి వీరమని (బకెట్ ), అక్కెనపల్లి వెంకటేశ్వర్లు (ఫ్రై ప్యాన్) ఈ అభ్యర్థుల గుర్తులపై ఇంజనీరింగ్ అధికారులు, అకౌంట్ సిబ్బంది, ఫైర్ సేఫ్టీ కెమిస్ట్రీ ఉద్యోగులు, కార్మిక సోదర సోదరీమణులు తమ మద్దతునిచ్చి అభ్యర్థుల గుర్తులపై మీ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, రాధాకృష్ణ, పుట్టా నాగేశ్వరరావు, రాము, శ్రీధర్, ఖాజ తదితరులు పాల్గొన్నారు.

## పల్లెల్లో చీకట్లు ... ప్రాణాలపై ముప్పు

- వీధిలైట్లు లేవు – పాములు, తేల్లుల భయం
- అధికారుల నిర్లక్ష్యం

**టేకులపల్లి, సెప్టెంబర్ 08, ప్రజాజ్యోతి:** మండలంలోని పలు గ్రామపంచాయతీలలో వీధిలైట్లు లేకపోవడంతో పల్లెలు చీకటిలో మగ్గుతున్నాయి. రాత్రి వేళల్లో అంధకారం అలుముకోవడంతో పాములు, తేళ్లు, విషపురుగులు స్వైర విహారం చేస్తూ ప్రజలకు ప్రాణభయాన్ని కలిగిస్తున్నాయి. ఈ విషయంపై తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి డి. ప్రసాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తీవ్రంగా స్పందించారు.ఇన్చార్జిలే పంచాయతీల “బాసులు” కావడం, స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడం, కేంద్ర ఆర్థిక సంఘం నిధులు ఆగిపోవడం వంటి కారణాల వల్ల గ్రామాల్లో చీకట్లు వీరబాధిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త వీధిలైట్లు కొనుగోలు చేయడానికి నిధులు లేకపోవడం, ఇప్పటికే ఉన్న లైట్ల నిర్వహణకు సరైన నిధులు కేటాయించకపోవడం వల్ల సమస్య మరింత ముదురుతోందని తెలిపారు.వర్షాకాలం కావడంతో పాములు, తేళ్లు, విషపురుగులు ఇళ్లలోకి చేరిపోతున్నాయన్న భయంతో గ్రామస్తులు రాత్రి నిద్ర పట్టని పరిస్థితిలో ఉన్నారని ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. “గ్రామాల్లో చీకటిని తొలగించి ప్రజలకు భద్రత కల్పించడంలో అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. లేదంటే ఐఎఫ్టియు ఆధ్వర్యంలో భారీ ఆందోళన చేపడతాం” అని ఆయన హెచ్చరించారు.

## మండల స్థాయి బోధనోపకరణాల మేళా



**చర్ల, సెప్టెంబర్ 8(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో సోమవారం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మండల స్థాయి బోధనోపకరణాల మేళా నిర్వహించారు.ఈ మేళాకు మండలంలోని కుదునూరు, చిన్న మిడిసిలేరు, తేగడ, గర్ల్స్ హైస్కూల్, గవర్నమెంట్ హైస్కూల్ కాంప్లెక్స్ ల పరిధిలోని అన్ని పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు హాజరై తాము తయారు చేసిన బోధనోపకరణాలు ప్రదర్శించారు.అన్నింటిలో ఉత్తమంగా ఉన్న భోధనోపకరణాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి పివి రమణ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేందుకు భోధనోపకరణాలు చాలా ఉపయోగపడతాయని సమాజంలో అత్యంత గౌరవప్రదమైనది అని అందరి మన్ననలు పొందేది ఉపాధ్యాయ ఉద్యోగమేనని అన్నారు.పిల్లల బంగారు భవిష్యత్తు బడుల్లోనే రూపుదిద్దుకుంటుందని తెలిపారు.ప్రస్తుతం మండలంలో ఎక్కువ మంది కొత్త ఉపాధ్యాయులే ఉన్నారని వారందరూ ఎంతో ఉత్సాహంగా తమ తమ విధులను నిర్వర్తిస్తున్నారని కొత్తగా వచ్చిన టీచర్లకు కితాబిచ్చారు.ఈ సందర్భంగా మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 16 మందిని ఘనంగా సత్కరించారు.

# అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తాం

## ఐటీడీఏ పీఓ రాహుల్

**భద్రాచలం, సెప్టెంబర్ 8,ప్రజాజ్యోతి :** గిరిజనుల సమస్యలు పరిష్కరించడంలో సంబంధిత యూనిట్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని, అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశించారు.సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్ కార్యక్రమంలో వివిధ గిరిజన గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో గిరిజనులు హాజరై తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించారు. ప్రాజెక్టు అధికారి రాహుల్ స్వయంగా ప్రతి అర్జీని పరిశీలించి, తన పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిగతా అర్జీలను తగిన విభాగాలకి పంపించి త్వరితగతిన పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.గిరిజనులు సమర్పించిన అర్జీలలో ప్రధానంగా పోడు భూముల సమస్యలు, పోడు భూముల పట్టాల మంజూరు, సౌర విద్యుత్ సౌకర్యం, వ్యవసాయ భూములకు కరెంటు మోటార్లు, భూ వివాదాలు, వ్యక్తిగత రుణాలు, జీవనోపాధి శిక్షణలు, కులాంతర వివాహ ప్రోత్సాహకాలు, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్స నిధులు, గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు, రైతుబంధు రుణాలు, చేపల సొసైటీలు ఏర్పాటు వంటి పలు అంశాలు ఉన్నాయి.ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ, “గిరిజన దర్బార్‌లో అందిన ప్రతి అర్జీని ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేసి, ఆన్లైన్‌లో అప్‌డేట్ చేస్తాం. అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి విడతలవారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తాం” అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఏడీఎంహెచ్ఓ సైదులు, ఏవో సున్నం రాంబాబు, ఎస్ఓ ఉదయభాస్కర్, డిటిఆర్ఓ ఎఫ్.ఆర్. లక్ష్మీనారాయణ, ఏపీవో పవర్ వేణు, ఉద్యానవనాధికారి ఉదయ్‌కుమార్, జేడీఎం హరికృష్ణ, మేనేజర్ ఆదినారాయణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనసూయ, అలాగే పలు విభాగాల సిబ్బంది నరేందర్, ముత్తయ్య, భార్గవి, మోహన్, నాగేశ్వరరావు, ప్రసాద్, జోగారావు, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



# ఆర్‌ఎంపీలు నిబంధనలు పాటించాలి

- ఇష్టరీతిన వైద్యం చేస్తే చర్యలు తప్పవు... డా. రాందాస్... వినాయకపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి





**అశ్వారావుపేట, సెప్టెంబర్ 08, ప్రజాజ్యోతి:** మండలంలోని ఆర్‌ఎంపీలు నిబంధనలు పాటించాలని, అనుమతులు లేకుండా ఇష్టరీతిన రక్త పరీక్ష కేంద్రాలు, క్లినిక్ లు నిర్వహించవద్దని వినాయకపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాందాస్ అన్నారు. సోమవారం నియోజకవర్గ కేంద్రంలోని పలు ఆర్ఎంపి క్లినిక్కులను తమ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలను పాటించని, అనుమతులు లేని ఆర్.ఎం.పి క్లినిక్ లు, రక్త పరీక్ష కేంద్రాలపై కఠినంగా వ్యవహరిస్తామని, ప్రజలు కూడా అర్హత కలిగిన వైద్యులతో మాత్రమే వైద్యం చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ సూచనలు పాటించకుండా వైద్యం చేస్తే జిల్లా అధికారులకు సమాచారం అందించి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఇటీవల ఓ ఆర్ఎంపి చికిత్స తో అనారోగ్యం పాలైన వ్యక్తి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను చికిత్స జరిగిన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎమ్ఓ మోహన్, హెచ్ఈఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఫోటో ట్రేడ్ ఎక్స్పో 2025 పోస్టర్ ఆవిష్కరణ

- జిల్లా కలెక్టర్, ఎస్పీ వేర్వేరు వేదికలపై ఆవిష్కరణ






**కొత్తగూడెం, సెప్టెంబర్ 8, ప్రజాజ్యోతి ;** తెలంగాణ రాష్ట్ర ఫోటోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 19 నుండి 21 వరకు హైదరాబాద్ నార్సింగ్ వద్ద ఓం కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న ఫోటో ట్రేడ్ ఎక్స్పో – 2025 పోస్టర్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జీతేష్ వి. పాటిల్ ఐఏఎస్ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.., ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఫోటోగ్రఫీ ఒక సృజనాత్మక వృత్తిగా మారిందని, ఇటువంటి ఎక్స్పోలు కొత్త పరికరాలు, డిజిటల్ టెక్నాలజీలు ప్రజలకు చేరువ కావడంలో దోహదపడతాయని తెలిపారు. యువత ఈ రంగాన్ని వృత్తిగా ఎంచుకోవడం ద్వారా మంచి అవకాశాలను పొందగలరని సూచించారు.అదే రోజు ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రోహిత్ రాజ్ ఐపిఎస్ పోస్టర్‌ను వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.., ఫోటోగ్రఫీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఈ తరహా ఎక్స్పోలు సృజనాత్మకత, ప్రతిభను వెలికితీయడానికి వేదికగా నిలుస్తాయని అన్నారు.జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కీసర సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఎక్స్పోలో ఆధునిక కెమెరాలు, లెన్సులు, డ్రోన్లు, ప్రింటింగ్ పరికరాలు, లైటింగ్ సిస్టమ్స్, ఫోటో ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్లు, స్టూడియో మోడల్స్ ప్రదర్శించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఫోటోగ్రాఫర్లు, ప్రొఫెషనల్ స్టూడియోలు, ఆసక్తిగల యువత తప్పక పాల్గొని ప్రయోజనం పొందాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ప్రధాన కార్యదర్శి వనచర్ల రామకృష్ణ, కొత్తగూడెం మండల అధ్యక్షుడు ముత్యాల రాజేష్, ప్రధాన కార్యదర్శి తెలంగాణ శంకర్, కోశాధికారి గాయత్రి ప్రభాకర్, జిల్లా కమిటీ సభ్యులు మస్తాన్ వలీ, స్థానిక ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం

- రోడ్డున పడిన ఓ నిరుపేద కుటుంబం
- రెక్కాడితే డొక్కా డే జీవితాలు.







**మణుగూరు, సెప్టెంబర్, 8 ,ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల పరిధిలో ని విప్పల సింగారం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో ఇల్లు దగ్ధం రోడ్డున పడిన కుటుంబం స్థానికుల కథనం మేరకు ఆదివారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంట్లో నుంచి పొగ రావడం వాసన రావడం చుట్టుపక్కల వాళ్ళు గమనించి రోజులాగే కూలికి వెళ్లిన బాధితులకు సమాచారం ఇవ్వగా హుటా హుటిగా . ఇంటికి చేరుకొని చూడడంతో ఇల్లు దగ్ధం అయిపోయింది. టీవీ, ఫ్రిడ్జ్, మంచాలు, బట్టలు, 62000 వేల రూపాయల డబ్బు, దగ్ధం సర్వం కోల్పే రోడ్డున పడ్డ కుటుంబం ఎండనక వాననక దాచుకున్న ధనం, వస్తువులు,ఇలా దగ్ధం అయిపోవడంతో రోదిస్తున్న కుటుంబ సభ్యులు.

# కలకాలం గుర్తుండేదే సాహిత్యం

- ప్రభాకరాచార్యులు రచనలు సమాజహితం కోరేవిగా ఉంటాయి
- ప్రభాత కెరటాలు ఆవిష్కరణ



**అశ్వారావుపేట, సెప్టెంబర్ 08, ప్రజాజ్యోతి:** సాహిత్యంతో ఏ వ్యక్తి అయినా కలకాలం గుర్తుండిపోయేలా ప్రజల మదిలో నిలబడవచ్చని ఆర్ట్ ఫౌండేషన్ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ జానపద అకాడమీ తొలి అధ్యక్షులు పొట్లూరి హరికృష్ణ అన్నారు.అశ్వారావుపేటకు చెందిన ప్రముఖ కవి ప్రభాకరాచార్యులు వ్రాసిన ప్రభాతకెరటాలు కవితాసంపుటి ఆవిష్కరించబడింది. పొట్లూరి హరికృష్ణ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని బిర్లా ఆడిటోరియంలో ఆదివారం రాత్రి జరిగిన ఆవిష్కరణసభలో తెలంగాణా సాహిత్యఅకాడమి తొలి అధ్యక్షులు నందిని సిద్ధారెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభాకరాచార్యులు రచనలు ప్రజాహితం కోరేవిగా ఉంటాయని,ప్రజలు రచనలపై ఆలోచిస్తేనే అప్పుడు సాహిత్యానికి విలువన్నారు. అటువంటి విలువలు కల రచనను తన కలం నుండి రాస్తూ ప్రజలను ఆలోచించేలా చేస్తున్న ప్రభాకరాచార్యులు నేటి తరానికి ఆదర్శమన్నారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త కర్నూల్ పూర్వ డి.ఐ.జి ఇక్బాల్, కేంద్రసాహిత్య అకాడమి అవార్డు గ్రహీత బాలసాహితీవేత్త నారంశెట్టి ఉమామహేశ్వరరావు, ధర్మకేతనం అధ్యక్షులు రఘువీరప్రతాప్, నేటినిజం సంపాదకులు బైసదేవదాస్, కన్నడ కవులు జోషి,రమేష్ గోపి తదితరులు పాల్గొన్నారు.

# పినపాక మండలస్థాయి క్రీడా ఎంపికలు

**పినపాక, సెప్టెంబర్ 08(ప్రజాజ్యోతి ):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బయ్యారంలో సోమవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. అండర్ 14, అండర్ 17 విభాగాలలో బాలురు, బాలికలు కబడ్డీ, కోకో, వాలీబాల్ క్రీడాంశాలలో మండల స్థాయి టీములను ఎంపిక చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి కొమరం నాగయ్య తెలిపారు. పినపాక కరకగూడెం మండలాల మండల స్థాయి టీములతో 09.09.2025న జోనల్ స్థాయి టీమ్ ల ఎంపికకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ఈ క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీవో సునీల్ SI సురేష్ , పినపాక జెడ్పి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. రమణ, వ్యాయామ ఉపాధ్యాయులు వీరన్న, ఆదినారాయణ, బాలరాజు, అనిల్ కుమార్ , రాములమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

